


## సత్ర కాయలు

బఫూన్లకంటే హీనంగా వుంటారు విదూషకులు. అయినా ఈవిదూషకులకు చరిత్రలో చాలాప్రముఖమైన స్థానమేవుంది. రాకుమారుడు వీధి బడిలో చదవకూడదు. బంటుగారబ్బాయితో గోలీకాయలాడకూడదు. అలగా జనంతో కూడి కోతికొమ్మచ్చిలూ, గోడ దూకడాలూ చేయకూడదు. అట్లాంటప్పుడు ఆ రాకుమారుడు ఒంటరిగా ఎట్లా బతగ్గలడు. అయినాసరే, హోదా పాటించి స్నేహాలు చేయాలేగాని ఉల్ఫాగాళ్ళతో తిరక్కూడదని ఒక రూలుంది. ఈరూలుని పాటించి మరో రాకుమారుడితో చెలిమి చేద్దామంటే అక్కడ కాంప్లెక్సు గొడవ వస్తుంది. నేనెక్కువంటే, నేనెక్కువని కొట్టుకు చస్తారు. నువ్వెంతంటే, నువ్వెంతని ఒకర్నొకరు లెక్క చేయకుండా మాట్లాడతారు.

అందుచేత ఒక రాకుమారుడు మరో రాకుమారుడితో సాధారణంగా స్నేహం చేయడు.

మంచి వంశంలో పుట్టిన కుర్రాడ్ని ఎంచుకుంటారు. వాడితో స్నేహం చేస్తాడు. అనుక్షణం అవతలి కుర్రాడిచేత ఆహా, ఓహో అని పించుకుంటూ మురిసిపోతుంటారు. అట్లా అట్లా పెరిగి పెద్దవారవు తారు. రాకుమారుడు యువరాజై, మహారాజై పోతాడు. అతని చెలికాడు విదూషకుడై స్నేహ వాత్సల్యాలకు బలై పోతాడు.

రాజుగారయిబ్బాయికి స్నేహితులమనే హోదా విదూషకులకు తృప్తి అంతఃపురంలోకి చొరవగా వెళ్ళిపోయే అవకాశం వాళ్ళకే వుంది. చిన్న చిన్న భటులమధ్య పెద్ద పెద్ద పెత్తనాలు చెలాయించవచ్చు. అప్పుడప్పుడు ఎవరక్కడ అని పిలిచి చిత్తం ప్రభూ అనిపించుకోవచ్చు. యువరాణికి తలనొప్పి వస్తే హాస్యమ్మాటలు నాలుగు చెప్పి, ఆమెను కిల కిల నవ్వించ వచ్చు. రాకుమారుడి భుజమ్మీద చేయి వేయవచ్చు. ఈ చిరు సరదాలకి విదూషకు డెంతో ముచ్చటపడి పోతుంటాడు.

రాకుమారుడు ఏదీ ఎక్కువ తినడు, ఏదీ ఎక్కువ తాగడు. విదూషకుడు ఈ సూత్రానికి పూర్తిగా వ్యతిరేకం. తాను తినేది తింటూనే రాకుమారుడు వదిలేసిన కోటాకూడా పుచ్చుకుంటూ వుంటాడు. తిండీ గుడ్డా విషయాల్లో విదూషకుడు అబగా వుంటాడు. అతని లేకితనమ్మీద రాకుమారుడు విమర్శిస్తే సిగ్గుపడటంపోయి, పొట్ట వూపుకుంటూ పక పకా నవ్వుతుంటాడు పాపం విదూషకుడు.

రాకుమారుడు కత్తి సాము, గుర్రపు స్వారీ ఇత్యాదులు ప్రాక్టీసు చేస్తుంటాడు. విదూషకుణ్ని పిలిచి అతన్తో పోటీ పెట్టుకుంటాడు. విదూష కుడు అస్తమానం రాకుమారుడి చేతిలో ఓడిపోతూ, వారి సహస కార్య లను కొనియాడుతూ వుండాలి. అంతేగాని పొరపాటునకూడా అతను రాకు మారుడ్ని ఓడించే ప్రయత్నం చేయకూడదు. అది రూలు. రాకుమారుడు తాను ఎల్లప్పుడూ గెలిచేందుకే విదూషకుణ్ణి ఏర్పాటు చేసుకుంటాడు. తెలిని

వాళ్ళతో సాహస క్రీడలు తలపెడితే తానెక్కడ ఓడిపోతానో అని రాకుమారుని భయం.

చాలా తడవలు రాకుమారుడికి చిరాకు, విసుగూ కలుగుతుంటాయి. విదూషకా! నీ వెకిలి, వినోద వేషాల్తో మమ్మల్ని విసిగించకు ఫో! అంటూ విదిలించి కొడతాడు. అంత మాట పడినందుకు విదూషకుడికి దుఃఖం రాకూడదు. వచ్చినా గుండెలలోనే ఏడ్చేసుకోవాలి. చిత్తం మహాప్రభూ! అంటూ అక్కడ్నుంచి తక్షణం రంగ నిష్క్రమణ చేయాలి. ఒక్కోసారి రాకుమారులు గొప్ప సరదా మూడ్‌లో ఉంటారు. విదూషకా, మమ్మల్ని కొంచెం వినోదపరుచు అని ఆర్డరు వేస్తారు. అప్పుడు విదూషకుడు తన సొంత బాధల్నీ, గొడవల్నీ మరచిపోయి ప్రభువులను వినోదపరిచే నిమిత్తం కోతి గంతులు వేయాలి.

యువరాజూ, యువరాణీ ప్రణయ కోపాలలోపడి నలిగి పోతుంటారు. అట్లాంటి సమయాలలో విదూషకుడికి చేతినిండా పని వుంటుంది. వారి గురించి వీరి దగ్గరా, వీరి గురించి వారి దగ్గరా తెగ పొగిడి అలసిపోతాడు. రాయబారం చేసి ఆ యిద్దర్నీ పడగ్గదిలోకి తోసి, తలుపులు మూసి నిట్టూర్చుతాడు. చిల్లర దాసీ సైతం విదూషకుడి విన్యాసం చూసి అసహ్యించుకున్నా తానేమీ పట్టించుకోడు. ఆ దాసి పిల్లని ప్రసన్నం చేసుకునేందుకు కిందా మీద పడిపోతాడు. అతని సొంత శృంగారం అంతకు మించి ఎదగడానికి వీల్లేదు.

యువరాజుగారికి కొందరు ఉంపుడుగత్తెలు కూడా వుంటారు. ఆ ముండలందరికీ ఉత్తరాలు రాసి విదూషకుడికిచ్చి పంపుతుంటారు యువరాజకుమారులు. "రాకుమారుని గూర్చి ఏమి చెప్పమంటావు గుణవతీ! వారి గుణ, శీల సంపద పరాక్రమ విక్రమోదంతములు అపారము అంటూ రాకుమారుని ముండ దగ్గర పొగిడే డాఫర్ పని కూడా విదూషకుడు చేస్తుం

టాడు. తాను చేస్తున్న పని నీచమనుకోడు. స్నేహమని పేరుపెట్టి ఆత్మీయ తని బిరుదిస్తాడు. తన యావత్తు కష్టాన్నీ ఈ పేర్లూ, బిరుదుల పరదాలలో దాచేసుకుంటాడు. టూకీగా విదూషకుడి చరిత్ర యిది.

ఈ కాలంలో కూడా అట్లాంటి విదూషకులు లేకుండా పోలేదు. వీళ్ళని సత్రకాయలని పిలుస్తారు. డబ్బెక్కువున్న మనిషి చుట్టూతా ఒకడో, పది మందో సత్రకాయలు స్నేహితులుగా వుంటారు. వాడి కారెక్కి సినిమాల కెడతారు. వాడి డబ్బుతో పీకల్దాకా తాగేస్తారు. వాడి పేరుమీద వ్యభిచారం చేస్తారు. వాడు ఛీ, ఛా! అన్నా పట్టించుకోరు. పట్టించుకుంటే పరదాల గతేం కాను? అని వాళ్ళ భయం. అంతేగాని తమ బతుకేదో తాము గుట్టుగా బతకడానికి బద్ధకిస్తారు ఎన్ని చెప్పండి, వినరు. వాడు మిమ్మల్ని నీచాతి నీచంగా చూస్తున్నాడని నిజం చెప్పండి. మిమ్మల్ని ఉరిమి చూస్తారు. అతను నా ఫ్రండు. ఫ్రండు చిన్న మాటంటే విసుక్కువస్తే ఇంక ఆ స్నేహా నికి అర్థం ఏమిటి? మీ అసలు గొడవేమిటో నాకు తెలుసు. అంత డబ్బున్న వాడికి నేను ఆప్తమిత్రుడి నయ్యేనని మీ అందరికీ మంట. మీరు నోచుకోని అదృష్టం నన్ను వరించిందని మీ అందరికి జెలసి, కసి. అయ్ హేట్యూ, అంటూ మీ మీద విరుచుకు పడతాడు. కనుక సత్రకాయలతో మాట్లాడే టప్పుడు మీరెన్నో జాగ్రత్తలు తీసుకోవలసి వుంది.